నమస్తే తెలంగాణ
# వికారాబాద్
III హైదరాబాద్, శనివారం 18 మే 2024 VIKARABAD

# నకిలీ విత్తనాలపై నిఘా..



- వికారాబాద్ జిల్లాలో తనిఖీలను ముమ్మరం చేసిన వ్యవసాయ శాఖ అధికారులు
- ఇప్పటివరకు 23 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- ఈ ఏడాలో ఇప్పటివరకు మూడు కేసుల నమోదు
- గతేడాది 11.45 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం.. మూడు కేసులు..
- ఇంకా ఏర్పాటుకాని టాస్క్‌ఫోర్స్ బృందాలు
- నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులకు అవగాహన

వికారాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): నకిలీ విత్తనాలపై జిల్లా యంత్రాంగం గట్టి నిఘా పెట్టింది. జిల్లాలోని ఏ ఒక్క రైతు కూడా వాటి బారినపడకుండా చర్యలకు ఉపక్రమించింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రైతులకు రైతువేదిక భవనాల్లో ఎలా అప్రమత్తంగా ఉండాలో అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు నకిలీ విత్తనాలపై జిల్లాలోని షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటివరకు మూడు కేసులు నమోదయ్యాయి. వ్యవసాయ-పోలీసు శాఖల ఆధ్వర్యంలో దాడులు చేసి కొడంగల్, యాలాల, దౌల్తాబాద్ మండలాల్లో రూ.39 లక్షల విలువ చేసే 23 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గతేడాది మూడు కేసులు నమోదు కాగా, రూ.14.77 లక్షల విలువ చేసే 11.45 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను, 2022-23లో 8 కేసులు నమోదుకాగా, రూ.35.28 కోట్ల విలువ చేసే 27.98 క్వింటాళ్ల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు జిల్లా రైతాంగం నకిలీ విత్తనాల బారిన పడకుండా జిల్లా వ్యవసాయ శాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందులో పత్తి సాగు చేసే రైతులు ఆ విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే కొనా లని సూచిస్తున్నది. అయితే కొందరు వ్యక్తులు గ్రామాల్లో హెచ్‌టీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు యత్నిస్తుం డడంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. తనిఖీలను ముమ్మరం చేశారు. కాగా నకిలీ విత్తనాల కట్టడికి ప్రతి ఏటా ఏర్పాటు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందాలను ఈ ఏడాది ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

### సరిపడా విత్తనాలు సిద్ధం..

జిల్లాలో వానకాలానికి సంబంధించి సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచారు. అదేవిధంగా జిల్లాలో 2.63 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేయగా 5,42,400 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు, వరికి సంబంధం చి 27,500 క్వింటాళ్ల విత్తనాలు, మొక్కజొన్న 4036 క్వింటాళ్లు, పెసర్లు-1040, కందులు-4500 క్వింటాళ్లు, మినుములు-400 క్వింటాళ్లు, సోయాబీన్-750 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అదేవిధంగా యూరియా, డీఏపీ, ఎన్‌పీకేఎస్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ ఎరువులు అన్ని కలిపి 75,437 మెట్రిక్ టన్నులు అవసరమని నిర్ణయించారు. యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17,719, కాంప్లెక్స్ ఎరువులు 19,877 , ఎంవోపీ 3658, ఎస్ఎస్‌పీ 1854 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని భావిస్తున్నారు. అయితే ఎరువులను పీఏసీఎస్, డీలర్లు, కంపెనీ గోదాంలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే సరఫరా చేయాలని నిర్ణయించారు.

### అప్రమత్తంగా ఉండాలి..



నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం తనిఖీలను ముమ్మరం చేశాం. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండడంతోపాటు.. అనుమతి లేని హెచ్‌టీ పత్తి విత్తనాలను కొని మోసపోవద్దు. రైతులు నకిలీ విత్తనాల బారినపడకుండా ఉండేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

**- గోపాల్, వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి**



# బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మే 17 : జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ఇంగ్లిష్ మీడియంలో ఒకటో తరగతి(డే స్కాలర్), ఐదోతరగతి(రెసిడెన్షియల్) విద్యార్థినీవిద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఒకటో తరగతిలో 88 సీట్లు, ఐదోతరగతిలో 91 సీట్లు ఉన్నాయన్నారు. ఏప్రిల్ 1, 2024 నాటికి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి రూ. 1.50 లక్షల్లోపు, పట్టణాల్లో నివసించే వారి ఆదాయం రూ.2లక్షల్లోపు ఉండాల న్నారు. కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కలెక్టరేట్ ఆవరణలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయాల్లో జూన్ 7 సాయంత్రం ఐదు గంటల్లోపు సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థినీవిద్యార్థుల కుటుంబ సభ్యుల్లో ఎవరైనా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గతంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివితే వారు అనర్హులన్నారు. ఒకటోతరగతి లో దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 1, 2018 నుంచి మే 31, 2019 మధ్యలో జన్మించి ఉండాలని ఇతర వివరాలకు 99086 90240 ఈ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

# వానకాలం.. ప్రణాళిక రెడీ

- 4,45,428 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం
- ఈ సీజన్‌లో పత్తికే రైతుల మొగ్గు..1,76,174 ఎకరాల్లో సాగుకు చాన్స్
- 48,959 ఎకరాల్లో ఉద్యాన, ఇతర పంటలు..
- 44,594 క్వింటాళ్ల విత్తనాలు, 1,01,982 టన్నుల ఎరువులు అవసరం
- 4,91,036 ప్యాకెట్ల పత్తి విత్తనాలు కావాలని అంచనా



రంగారెడ్డి, మే 17 (నమస్తే తెలంగాణ) : వానకాల సీజన్‌కు రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధమైనది. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు, విత్తనాలను ఉంచేందుకు ప్లాన్ చేస్తున్నది. ఈసారి 4,45, 428 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నది. వరి, జొన్న, కంది, పెసర, మినుము, కంది, మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం తదితర పంటల కోసం 44,594 క్వింటాళ్ల విత్తనాలు, 1,01,982 టన్నుల ఎరువులు, 4,91,036 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం అవుతాయని అధికారులు భావిస్తున్నా రు. ఇప్పటికే యాసంగి సీజన్ ముగిసి వానకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవు తున్న తరుణంలో వారికి ఎక్కడా ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పత్తి ధర ఎక్కువగా ఉండడంతో ఎక్కువమంది పత్తి వేసేందుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో 1,76,174 ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉంది. రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

### 4,45,428 ఎకరాల్లో సాగు..

వానకాలంలో 4,45,428 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సా గు చేస్తారని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసి దానికి అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో అత్యధికంగా పత్తి 1,76,174 ఎకరాల్లో, వరి 1,38,187 ఎకరాల్లో, మొక్కజొన్న 66,530 ఎకరాల్లో, ఉద్యాన పంటలతోసహా ఇతర పంటలను 48,959 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా..

పంటల సాగుకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. సాగు అంచనాకు అనుగుణంగా 44,594 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచనున్నారు. అలాగే 4,91,036 పత్తి ప్యాకెట్లు అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు నివేదికను పం పించారు. 1,01,982 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు రకాల విత్తనాలు, ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచగా..రానున్న రోజుల్లో ఎటువంటి కొరత లేకుండా చూస్తున్నామని జిల్లా అధికారులు చెబుతున్నారు.

### పంటల సాగు విస్తీర్ణం వివరాలు..

| పంట | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | కావాల్సిన విత్తనాలు (క్వింటాల్లో) |
|---|---|---|
| వరి | 1,38,187 | 34,547 |
| జొన్న | 3,361 | 134 |
| మొక్కజొన్న | 66,530 | 5,322 |
| పెసర్లు | 48 | 0.25 |
| కందులు | 11,548 | 346 |
| మినుములు | 34 | 2.72 |
| వేరుశనగ | 550 | 330 |
| ఆముదం | 37 | 0.74 |
| ఇతర పంటలు | 48,959 | 3,912 |
| పత్తి | 1,76,174 | 4,91,036 ప్యాకెట్లు |

### కావాల్సిన ఎరువులు..

| ఎరువులు | కావాల్సినవి(టన్నుల్లో) |
|---|---|
| యూరియా | 41,115 |
| డీఏపీ | 14,897 |
| ఎస్ఎస్‌పీ | 4,283 |
| ఎంవోపీ | 5,139 |
| కాంప్లెక్స్ | 36,548 |
| మొత్తం | 1,01,982 |



### సబ్సిడీపై జీలుగ, జనుము ..

| పంట | అమ్మకం ధర | సబ్సిడీ ధర | రైతు వాటా | సబ్సిడీ |
|---|---|---|---|---|
| జీలుగ | రూ.9,300 | రూ.5,580 | రూ.3,720 | 60 శాతం |
| జనుము | రూ.9,050 | రూ.5,430 | రూ.3,620 | 60 శాతం |

### నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు..

**-గీతారెడ్డి, రంగాడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి**



వానకాలంలో సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటు న్నాం. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. పత్తి బీటీ-1 విత్తన(450 గ్రా.) ప్యాకెట్‌కు రూ.635, బీటీ-2 విత్తన ప్యాకెట్‌కు రూ.864 చొప్పున ధరను నిర్దేశించడం జరిగింది. రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను జిల్లాలోని ఏఆర్ఎస్‌కే, పీఏసీఎస్, డీసీఎంఎస్‌లలో 30 కౌంటర్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు పట్టాదా రు పాసు పుస్తకం, ఆధార్ కార్డును వెంట తప్పనిసరిగా తీసుకురావాలి.

# 24న పట్నం వైస్‌చైర్మన్ ఎన్నిక

- 24న పట్నం వైస్‌చైర్మన్ ఎన్నిక
- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- అవిశ్వాసంతో పదవి కోల్పోయిన వైస్‌చైర్మన్ యాదగిరి
- రేసులో కౌన్సిలర్ బర్ల మంగ..
- ఎన్నికయ్యే అవకాశం




ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం, మే 17 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు ము హూర్తం ఖరారైంది. ఈ నెల 24వ తేదీన ఆ పదవిని భర్తీ చేసేందుకు చర్యలు తీసు కోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల అధికారిగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈనెల 24న ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఉంటుందని కౌన్సిల ర్లకు మున్సిపల్ కమిషనర్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న కప్పరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానాన్ని పెట్టించడంలో వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి ప్రధాన కారకుడని భావించిన ఆమె(కప్పరి స్రవంతి) కాంగ్రెస్‌లో చేరి మెజార్టీ కౌన్సిలర్ల మద్దతుతో యాదగిరిపై అవిశ్వాస తీర్మానాన్ని ఏప్రిల్ 4న పెట్టారు. అయితే ఆ మీటింగ్‌కు రెండురోజుల ముందే ఆయన తన పదవికి రాజీనామా చేశా రు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వైస్‌చైర్మన్ ఎన్నికకు ముహూర్తం లభించలేదు. కాగా ఆ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ఖాళీగా ఉన్న వైస్‌చైర్మన్ పదవిని భర్తీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

### బరిలో బర్ల మంగ..

ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికకు కలెక్టర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఈ నెల 24న ఎన్నిక జరుగనున్నది. అయితే ఆ పదవిని చేజిక్కించుకునేందుకు 22వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న బర్ల మంగ పోటీ పడుతున్నారు. వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన సమయంలో క్యాంపు ఖర్చులు మొత్తం ఆమెనే భరించినట్లు సమాచారం. దీంతో బర్ల మంగను వైస్‌చైర్మన్‌గా ఎన్నుకునేందుకు చైర్మన్‌తోసహా మెజార్టీ కౌన్సిలర్లు మద్దతు ఇస్తున్నారు. ఆమె ఎన్నికయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బర్ల మంగ బీఆర్ఎస్‌లో కీలక నేత. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరారు.


TELANGANA STATE ELECTION COMMISSION

NOTIFICATION

Sd/-C. PARTHA SARATHI
STATE ELECTION COMMISSIONER

//ATTESTED//

వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం కలెక్టర్ అందజేసిన నోటీసులు..



తాండూరు రైల్వేస్టేషన్ పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం భర్తేశ్ కుమార్ జైన్

# ఏడాదిలో కొత్త రైల్వేస్టేషన్

**- పనులను పరిశీలించిన డీఆర్ఎం భర్తేశ్ కుమార్ జైన్**

తాండూరు, మే 17 : ఏడాదిలోగా తాండూరు కొత్త రైల్వేస్టేషన్ అందుబాటులోకి వస్తుందని.. పనులు చురుగ్గా సాగుతున్నాయని దక్షిణ మధ్య రైల్వేశాఖ డివిజన్ రైల్వే మేనేజర్ భర్తేశ్‌కుమార్ జైన్ తెలిపారు. శుక్రవారం తాండూరు రైల్వేస్టేషన్ పనులను పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. అమృత్‌భారత్‌లో భాగంగా రూ. 25 కోట్లతో చేపట్టిన తాండూరు రైల్వేస్టేషన్ పనులు నాణ్యతతో జరుగుతున్నాయని.. ప్రయాణికులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వేశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెట్రో వేళలు పొడిగింపు



**మరో 45 నిమిషాలు పెంపు**

- ఇక నుంచి చివరి రైలు 11.45
- ప్రతి సోమవారం ఉదయం 5:30 గంటలకే..

సిటీబ్యూరో: నగరవాసులకు గుడ్ న్యూస్. మెట్రో రైలు వేళల్లో అధికారులు మార్పు చేశారు. ఇప్పటివరకు రాత్రి 11 గంటల వరకు చివరి రైలు ఉండగా.. ఇక నుంచి ఆ రైలు 11.45 గంటలకు బయలుదేరి.. గమ్యస్థానానికి 12.45 గంటలకు చేరుకుంటుంది. అలాగే ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటలకే మెట్రో రాకపోకలు మొదలుకానున్నది. మిగతా రోజుల్లో సాధారణంగానే ఉదయం 6 నుంచే సర్వీసులు నడుస్తాయి. పొడగించిన వేళలు శుక్రవారం రాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి.

### ప్రతి రోజూ 4.5 లక్షల మంది ప్రయాణికులు

నార్సింగిలో తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ ఆన్వల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సమ్మిట్-2024 జరిగింది. ఈ కార్యక్రమానికి మెట్రో రైల్ ఎల్ అండ్ టీ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరద రాజన్ హాజరయ్యారు. 'ద మొబిలిటీ ఫర్ టుడే అండ్ టుమారో' అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రతి రోజూ మెట్రో సేవలను 4.5 లక్షల మంది ప్రయాణికులు వినియోగించుకుంటున్నారని, సగటు ట్రిప్ పొడవు 12.5 కిలోమీటర్లు అని వివరించారు. నగరవాసుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల దృష్ట్యా మెట్రో సమయాన్ని మరో 45 నిమిషాల పాటు పొడిగించినట్లు వెల్లడించారు. కాగా, ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ 'ద బెస్ట్ గ్రీనింగ్ ద ఫ్యూచర్2023-24' అవార్డును దక్కించుకున్నది.

# ఇంత నిర్లక్ష్యమా..?

లక్షల విలువైన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఫర్నిచర్‌ను గాలికి వదిలేశారు. ఎండకు ఎండుతూ..వానకు తడుస్తున్నా..పట్టించుకోవడం లేదు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా తరగతి గదుల్లో ఉన్న ఫర్నిచర్‌ను తీసి..పాఠశాలల మైదానంలో వేశారు. అయితే పోలింగ్ పూర్తయిన వెంటనే వాటిని తిరిగి తరగతి గదుల్లో పెట్టించాలన్న ఆలోచనను అధికారులు మర్చిపోయారు. దీంతో విలువైన ఫర్నిచర్ పాడైపోయే అవకాశమున్నది. బాలాపూర్ మండల పరిధిలోని అన్ని సర్కారు స్కూళ్లలో ఇదే పరిస్థితి నెలకొన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'మన ఊరు- మన బడి' కింద కోట్లు ఖర్చు చేసి.. ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ కొత్త ఫర్నిచర్‌ను అందజేశారు. ఈ ఫర్నిచర్ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేది. ఇదిలా ఉంటే మున్సిపల్ అధికారులు మాత్రం ఎవరి ఫర్నిచర్ వారే చూసుకోవాల్సిందేనంటున్నారు. ఈ విషయమై విద్యాధికారులకు ఫోన్లు చేసినా.. స్పందించడంలేదు. కొందరు ఉపాధ్యాయులు స్పందించినా మున్సిపల్ అధికారులు చూసుకుంటారని సమాధానాన్ని దాట వేశారు. మీర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఆరుబయట పడేసిన ఫర్నిచర్‌ను చిత్రంలో చూడొచ్చు.

-బడంగ్‌పేట, మే17

